సాక్షి
తిరుపతి
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



పోలీస్ గ్రీవెన్స్‌కు 80 ఫిర్యాదులు

తిరుపతి క్రైం: ఎస్పీ కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికకు 80 ఫిర్యాదులొచ్చినట్టు ఎస్పీ తెలిపారు.



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి అర్బన్: నిరుద్యోగులు జాబ్ మేళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

పందిళ్ల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం : ఎస్పీ

తిరుపతి క్రైమ్: జిల్లాలో వినాయక చవితి ఉత్సవ మండపాలు, పందిళ్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అందు బాటులోకి తీసుకొచ్చిందని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. 7995095800 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సందేశం పంపిస్తే అనుసరిం చాల్సిన ప్రక్రియపై రిప్లై వస్తుందన్నారు.

న్యూస్‌రీల్

ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఓవీఎస్ రెడ్డి



తిరుపతి సిటీ: ఎస్వీయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ ఓ.విజయ సారథిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఆయన బయోకెమిస్ట్రీ విభాగంలో 32 ఏళ్లుగా అధ్యాపకులుగా కొనసాగుతున్నారు.

6న సీల్డ్ టెండర్లు

తిరుపతి అలిపిరి : తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్‌ల సీల్డ్ టెండర్లను టీటీడీ ఆహ్వానిస్తోంది. టెండర్ పొందిన వారు టీటీడీ వినియోగించిన ఖాళీ టిన్‌లు సేకరించవచ్చు. తిరుపతిలోని హరేకృష్ణ రోడ్డులో గల మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు మార్కెటింగ్ (వేలం) కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో సంప్రదించవచ్చు.

మిద్దెపై నుంచి పడి చిన్నారి మృతి

నాయుడుపేట టౌన్: మిద్దెపై నుంచి జారిపడి చిన్నారి మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. బాధితుల కథనం.. నాయుడుపేటకు చెందిన నక్కలోళ్లకు సంబంధించి నక్కల చరణ్ బంధువు వివాహ వేడుకలను అయ్యప్పరెడ్డిపాళెం గ్రామ జాతీయ రహదారి సమీపంలో ఉన్న లేఅవుట్ల వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం చరణ్‌కు సంబంధించి నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద అతని ఐదేళ్ల చిన్నారి రోసి మిద్దెపైకి వెళ్లి ఆడుకుంటోంది. ఇంతలో ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడింది. హుటాహుటిన స్థానిక వైద్యశాలకు తరలించగా.. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై సోమవారం రాత్రి వరకు కూడా పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మహో నివాళి!

ఏళ్లు గడిచినా.. నీ సేవలు పదిలం.. నీ అభివృద్ధి శాశ్వతం.. మా గుండె గుడిలో నీ రూపం పదిలం.. నిను మేం మరువలేం రాజన్నా.. అంటూ అభిమానులు కన్నీళ్లు పెట్టుకున్నారు. దివంగత మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మహానేత లేనిలోటు తీర్చలేనిదని ఆవేదనలో మునిగిపోయారు. చెరగని చిరునవ్వుతో పేదల మదిలో గూడుకట్టుకున్నారని మురిసిపోయారు. భౌతికంగా దూరమైనా ఆయన ఆప్యాయత, అనురాగాలు, అభివృద్ధి కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు. జోహార్ వైఎస్సార్.. వైఎస్సార్ అమరరహే అంటూ నినాదాలు మిన్నంటించారు. అన్నదానాలు, రక్తదానాలతో సేవా కార్యక్రమాలు మిన్నంటించారు.

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- మహానేతను గుర్తుచేసుకుని కన్నీళ్లు పెట్టుకున్న అభిమానులు
- రాజన్న విగ్రహాలకు పుష్పాంజలి ఘటించిన నేతలు
- జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో తరించిన కార్యకర్తలు

తిరుపతి అర్బన్: జిల్లాలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డికి ఘన నివాళులర్పించారు. సోమవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా వాడవాడలా మహానేత విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. పేదల దేవుడు పెద్దాయన లేనిలోటు పూడ్చలేనిదని కన్నీటి పర్యంతమయ్యారు. పలువురు నేతలు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు మిన్నంటించారు.

తిరుపతి తుడా సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీషా, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి నేతృత్వంలో 500 మందికి అన్నదానం చేశారు. అనంతరం తిరుపతిలోని బ్యాంక్ ఉద్యోగుల కాలనీలో ఎంపీ మద్దిల గురుమూర్తి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.



తిరుపతి తుడా సర్కిల్ వద్ద వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సమన్వయకర్త అభినయ్, మేయర్ శిరీషా

- చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లులోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి నేతృత్వంలో పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. పెరుమాళ్లపల్లిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొత్తపాటి మునీశ్వర్ రెడ్డి నేతృత్వంలో అన్నదానం చేపట్టారు. పార్టీ నేత చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.



చిన్నగొట్టిగల్లులో నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి, ఎంపీ గురుమూర్తి

- శ్రీకాళహస్తి సినిమా వీధిలోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో ఘన నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, పార్టీ నేతలు వడ్లతాంగల్ బాలాజీరెడ్డి, పగడాల రాజు, వాసుదేవనాయుడు, కోవి చంద్రయ్యనాయుడు, మధుసూదన్‌రావు, వయ్యాల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



వెంకటగిరి నేదురుమల్లి నివాసం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు

- వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి నివాసం వద్ద మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు మిన్నంటించారు.



నాయుడుపేటలో నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేటలో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య నేతృత్వంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించారు. సూళ్లూరుపేటలో ఎంపీపీ అల్లూరి అనీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

- సత్యవేడు నియోజకవర్గంలోని బీఎన్ కండ్రి, కేవీబీపురం, నారాయణవనంలో పార్టీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. బీఎన్‌కండ్రిగలో సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ రాకేష్, కేవీబీపురంలో జీ.క్రిష్టయ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. నారాయణవనంలో పార్టీ మండల కన్వీనర్ సొరకాయల వైఎస్సార్‌కు ఘన నివాళి అర్పించారు.



నారాయణవనంలో నివాళి అర్పిస్తున్న ఎన్.రాజేష్

- గూడూరు పట్టణంలోని పడిగే సాహెబ్‌పేటలో ఎమ్మెల్సీ మేరుగు మురళీధర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు ఘన నివాళి అర్పించారు. జెడ్పీటీసీ ఊటుకూరు యామినితోపాటు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గూడూరులో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

అమరుడు వైఎస్సార్

- రాజన్న ఓ అరుదైన వ్యక్తి
- మానవీయ కోణంలో పాలించిన సీఎం
- ఆయన సంక్షేమ పథకాలను తొలగించే సాహసం ఎవ్వరూ చేయలేరు
- 15వ వర్ధంతి రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రముఖుల ఘన నివాళి



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమన, పక్కన ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: 'మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి ఓ అరుదైన వ్యక్తి. ఆయనతో ఎవరికి పరిచయం లేనప్పటికీ.. బాంధవ్యం నెరపనప్పటికీ.. వియ్యం, సఖ్యత లేనప్పటికీ వైఎస్సార్ మరణం ఆంధ్రరాష్ట్ర ప్రజలందర్నీ కుదిపేసింది' అని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి ఆధ్వర్యంలో నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డితో పాటు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, నగర మేయర్ డాక్టర్ శిరీష, మేధావులు, సీనియర్ జర్నలిస్టులు, రాజకీయ నేతలు హాజరయ్యారు. వైఎస్సార్ వ్యక్తిత్వాన్ని, ఆయనతో వారికి ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకుని చలించిపోయారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించినా.. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రాజెక్టుల రూపంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పదిహేను కోట్ల మంది ప్రజల హృదయాల్లో చిరంజీవిగా నిలిచిపోయారని కొనియాడారు. కేవీపీ తరువాత వైఎస్సార్ తనతో అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తి అని భూ కరుణాకరరెడ్డి గుర్తుచేశారు.

నేను ఎంపీ అయ్యానంటే!

'విద్యార్థి నాయకుడిగా నేను మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిని నాలుగు సార్లు కలిశా. వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోనే చదువుకున్నా. ఆరోగ్యశ్రీ పథకం కింద నా తండ్రికి ఆపరేషన్ తోపాటు రైతు రుణమాఫీ కూడా జరిగింది. వైఎస్సార్ భౌతికంగా లేకపోయినా ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు చిరంజీవిగా నిలిచిపోయాయి' అని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి గుర్తుచేసుకున్నారు. వైఎస్సార్ బాటలోనే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారని కొనియాడారు. అతి సామాన్యుడు అయిన తనను దేశంలోనే ప్రతిష్టాత్మకమైన తిరుపతి ఎంపీగా చేయడం వైఎస్ జగన్ గొప్పతనానికి నిదర్శనమన్నారు. అనంతరం తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీషా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త మాకిరెడ్డి పురుషోత్తంరెడ్డి వైఎస్సార్ జ్ఞాపకాలను నెమరువేసుకుని ఉప్పొంగిపోయారు. ఆయన మరణం నేటి సమాజానికి తీరని లోటన్నారు. ఇంకా కార్పొరేటర్లు ఆరణి సంధ్య, అనిల్, ఆదం రాధాకృష్ణారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు పీవీ.రవికుమార్, నగేష్, ఆదిమూలపు శేఖర్, నేతాజీ, రమణారెడ్డి వైఎస్సార్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో రామస్వామి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరె. అజయ్, ఎం.రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ మంజూరు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని పశువైద్య కళాశాలలో పశు ఉత్పత్తుల సాంకేతిక శాస్త్ర విభాగం (ఎల్‌పీటీ) ఆధ్వర్యంలో వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద నడుస్తున్న మాంసాహార ఉత్పత్తుల విక్రయశాలకు ఆహార భద్రతా చట్టం కింద లైసెన్స్ మంజూరైంది. ఈ మేరకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫైడ్ లైసెన్స్ పత్రాన్ని వీసీ రమణ ఎల్‌పీటీ విభాగాధిపతి డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రస్తుతం విక్రయశాలలోని నగ్గెట్స్, సాసేజులు, మాంసాహార ఊరగాయలు, స్వచ్ఛమైన పంది మాంసం వంటి వాటిని ఫుడ్ సేఫ్టీ అధికారులు పూర్తి స్థాయిలో పరీక్షలు చేసి లైసెన్స్‌ను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో డీన్ వీరబ్రహ్మం, అసోసియేట్ డీన్ జగపతిరామయ్య పాల్గొన్నారు



వీసీ నుంచి లైసెన్స్ అందుకుంటున్న ఎల్‌పీటీ విభాగాధిపతి

రాయలసీమకే తలమానికం ఎస్వీయూ

- 70వ వ్యవస్థాపక దినోత్సవంలో ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ అప్పారావు

తిరుపతి సిటీ: విద్యారంగంలో రాయలసీమకే తలమానికంగా నిలిచిన ఎస్వీయూను మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు ఉద్యోగులు ఐకమత్యంతో పనిచేయాలని ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. సోమవారం వర్సిటీ నాన్‌టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాస ఆడిటోరియంలో ఎస్వీయూ 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. విశ్వవిద్యాలయం ఆరు శాఖలతో ప్రారంభమై, నేడు 54 శాఖలలో 73 కోర్సుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తోందన్నారు. ఇటీవల నూతన కోర్స్‌గా డేటా సైన్స్ ఎక్స్‌ప్లుయన్స్ కంపెనీతో ప్రారంభించినట్టు వెల్లడించారు. ఎన్ఐఈఎల్ఐటీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ - ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సెంటర్‌ను కేంద్ర ప్రభుత్వం వర్సిటీలో స్థాపించేందుకు అనుమతులు ఇవ్వడం శుభపరిణామమన్నారు. ఏబీసీ(అకాడమిక్ బ్యాంకు ఆఫ్ డిపాసిటరీ), డిజిలాకర్, ఏపీఏఏఆర్‌లు ఎప్పటికప్పుడు విద్యార్థుల డేటాను డిజిటలైజ్ ప్రక్రియ శరవేగంగా జరుగుతోందన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ వర్సిటీ ఆవరణలోని సమస్యల సత్వర పరిష్కారం దిశగా అడుగులేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్ర మంలో నాన్ టీచింగ్ అసోసియేషన్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు గుర్రంకొండ శ్రీధర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ముత్తువేలు, మురళి ఆఫీసు బేరర్లు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ అప్పారావు

గ్రీవెన్స్ గందరగోళం

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్ వద్ద గ్రీవెన్స్ నిర్వహణ గందరగోళంగా మారింది. ధర్నాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. ప్రతి సోమవారం తిరుచానూరు పోలీసులు జనాన్ని కంట్రోల్ చేయడానికే సమయం సరిపోతోంది. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు 219 ఫిర్యాదులు అందాయి. అందులో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 146 ఫిర్యాదులు ఉన్నాయి. గ్రీవెన్స్ వద్ద ఫిర్యాదుదారులకు ఎలాంటి వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

పచ్చని పల్లెల్లో పాల చిచ్చా?

భాకరాపేట : కూటమి నేతలు పచ్చని పల్లెల్లో పాల చిచ్చు పెట్టడం సమంజసం కాదని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హితవు పలికారు. ఆయన సోమవారం చిన్నగొట్టిగల్లులో పర్యటించగా.. పలువురు పాడిరైతులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే అమూల్ డెయిరీని మూసివేసిన కూటమి ప్రభుత్వం పాడి రైతులను వెంటాడుతూ గ్రామాల్లో ఇతర డెయిరీలకు పాలు అమ్ముకుంటున్న వారిని బెదిరించడం సబబు కాదన్నారు. చిన్నగొట్టిగల్లు పంచాయతీ టీ.కుమ్మరపల్లె గ్రామంలో గత మూడేళ్లుగా శ్రీజ డెయిరీకి పాలు పోసి జీవనం సాగిస్తున్న బావాజీ వైఎస్సార్‌సీపీ అభిమాని అని, అతన్ని ఏజెంట్‌గా తీయకపోతే గ్రామంలోకి శ్రీజ పాల వ్యానును రానీయమంటూ బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శ్రీజ డెయిరీ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి పాడి రైతు, ఏజెంట్ బావాజీకి న్యాయం చేయాలని కోరారు. ఇలానే కొనసాగితే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.



మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న పాడి రైతు బావాజీ